# దొరికిన కుక్కపిల్ల

ఒకమనిషి జీవితంలో గొప్ప గొప్ప అనుబంధాలు ఒకటి రెండు కంటే ఏర్పడవు. శ్రీనివాసరావు ఆవేళ ఆ కుక్కపిల్లను ఇంటికి తీసుకొస్తూ అనుకున్నాడు.

ఈ కుక్కపిల్లకూ తనకూ సంబంధం ఏమిటి ? ఎక్కడపుట్టిందో, ఎల్లావచ్చిందో, దానికి తనమీద ఇంత అనురాగం కలగడానికి కారణం ఏముంది? అతనికి చటుక్కున అనిపించింది. నవ్య నాగరికత ఏం చెప్పినాసరే జన్మాంతర సౌహృదాలు ఉండితీరతాయి. దేవుడనండి, మరో పరతత్వం అనండి, ఈ లోకంలో అనుబంధాలను శాసించేది ఏదో ఒకటి ఉంది.

అతను మౌంటురోడ్డులో లాంతరు స్తంభానికి జేరబడి ఆలోచిస్తున్నాడు. ఆరోజున ఒక పెద్దసమస్య వచ్చిపడింది అతనికి. అమ్మమ్మ అతనికి నెలకూ సరిపడ ఇచ్చిన ముప్ఫయిరూపాయలూ, మొదటివారంలోనే కర్చయిపోయాయి. ప్రపంచం తల్లకిందయినా అమ్మమ్మ ఆ నెలలో ఇంక ఒక్క

దమ్మిడీ ఇవ్వదు. సాయంకాలం ఆ అమ్మాయి సినీమాకి వెడదామంది. అమ్మమ్మదగ్గర డబ్బంటే అతనికి అభ్యంతరం లేదు. కాని, తనటోటివాళ్ళు ఆ డబ్బుమీద ఆధారపడి ఉండవలిసినగతి-అదీ అతని అభ్యంతరం.

అతని పాంటుకీ, జోడుకీమధ్య మడమమీద ఏదో మెత్తని స్పర్శ అతన్ని మేలుకొలిపింది. చూశాడు. ఒక చిన్న తెల్లని కుక్కపిల్ల మెల్లగా కాలినీ, జోడునీ, పాంటునీ వాసన చూస్తోంది. విసుగ్గా దాన్ని కాలితో అవతలికి తోశాడు. అది కుంయిమని ఒక పిల్లిమంత్రం వేసిమళ్ళీ తోక ఆడిస్తూ దగ్గరగా వచ్చింది.

అసలు అతనికి కుక్కలజాతిమీద వట్టిఅసహ్యమేకాదు, చెప్పరాని దుగ్ధకూడా ఉంది, అతనంటే సామాన్యంగా కుక్కలకు ఏదో అనుమానం, కోపం. ఒకనాడతను ఉదాత్తమయిన విషయాలను ఊహించుకుంటూ-ప్రేమ, యౌవ్వనం-మొదలయినవి-ఒక ఇంట్లోకి వెళ్ళబోతుంటే ఒకకుక్క చాలా అమర్యాదగా అతనియెడల ప్రవర్తించింది. అతన్ని నేలమీదకి పడగొట్టి అవమానించింది, ఆనాడుమొదలు అతనికి కుక్కలమీద కోపం. ఈరోజుల్లో వీల్లేదుగాని, లేకపోతే జనమేజయుడి సర్పయాగంలాగ, అతను కుక్కల నన్నింటినీ నాశనంచేసి, ఆ జాతి సృష్టిలో లేకుండాచెయ్యడానికి ఒకయాగం చేసేవాడే,

కుక్కపిల్ల తోక ఆడిస్తూ అతనిదగ్గరగా వచ్చింది. తెల్లటిబొచ్చు ముఖంమీదకూడా వేలాడుతోంది. అందులోనించి రెండు నల్లటి కళ్ళూ, సున్నితమయిన ముక్కూ, మూతి అతనికి కనిపించాయి. వొత్తుగాఉన్న బొచ్చుమూలాన్ని అది తోక ఆడిస్తుంటే వెనకభాగం అంతా ఆడిస్తూన్నట్టు అతనికి అనిపించింది. దానిముఖంలో ఏదో ఊహ, ఏదో కుతూహలం ఉన్నట్టు అతనికి తోచింది. అంతే. అతని మనస్సు ద్రవించింది. ఆ కుక్కపిల్లని చంకలో ఎత్తుకుని అతను ఇంటికి బయలుదేరాడు.

అమ్మమ్మ నడవలో పడుకుంది ఆమెను తప్పించుకుని అతను గది లోకి వెళ్ళాడు. ఒక చిన్న తాడుతీసి కుక్కపిల్లని మంచంకోడుకి కట్టేశాడు. ఇంతలో అవతలనించి అమ్మమ్మ గొంతుక వినిపించింది.

"ఇంత పొద్దెక్కేదాకా ఎక్కడ తిరుగుతున్నావురా ?"

"లేదమ్మమ్మా, ఒక స్నేహితుడితో మాట్లాడుతున్నాను."

"తిండితిని ఏడవకూడదూ ?"

అతను దుస్తులుమార్చి భోజనానికి లేచాడు. అతను గదిలోంచి బయటకు వొస్తుంటే కుక్కపిల్ల మూలుగుతూ. తోకఆడిస్తూ కట్టుతాడు లాగడం ప్రారంభించింది. అప్పుడే దీనివిషయం అమ్మమ్మకు తెలియకూడదని అలమారులో ఫ్లాస్కులో ఉన్నపాలు ఒకప్లేటులోపోసి దానిముందుపెట్టాడు. అది దీక్షగా ఆపాలను చప్పరిస్తుండగా అతను భోజనానికి వెళ్ళాడు.

అతనికి అమ్మమ్మమీద ఉన్నట్టుండి అమిత దయ కలిగింది.

" అమ్మమ్మా నువ్వు నీ గదిలోకిపోయి పడుకో. నేను పెట్టుకు తింటాను. "

"అన్నీ ముట్టుకు తగలేస్తావు."

"అమ్మమ్మా. జాగ్రత్తగా పెట్టుకు తింటాను."

కుక్కపిల్లకు ఎల్లానో అన్నం పెట్టాలి. అమ్మమ్మకు తెలియకూడదు. కాని అమ్మమ్మ ఏమయినా వంటింటిమీద తనకున్న అధికారాన్ని అతనికి ఒప్పగించడానికి ఒప్పుకోలేదు.

"పెళ్ళిచేసుకోరా నాయనా! అంటే నువ్వెక్కడ వింటావు ? నేను చచ్చేదాకా ఈ చాకిరీతో ఇదవవలిసిందే."

"ఏదన్నా ఉద్యోగం చూసుకోకుండా పెళ్ళిచేసుకుంటే పెళ్ళానికి నామీద గౌరవం ఉండదు అమ్మమ్మా"

"గౌరవ మేమిటి నీ మొహం? మీయమ్మ పోయిన నాటినించీ నా నెత్తిన పడింది ఈ బాదరబందీ అంతాను."

"మంచిపిల్ల నెవరినయినా చూడు అయితేను."

"లక్షమంది మంచిపిల్ల లున్నారు.... ....చూడు. ఒరేయ్! మా మేనమామ మనుమళ్ళాలుందిరా. చక్కగా బంగారపు బొమ్మలా గుంటుంది. వాడు మొన్న కబురు పంపాడు కూడాను."

"చూద్దాంలే."

"నే పోయి పడుకుంటాను. చెయ్యి కడుక్కుని వంటింటి తలుపు వేసిరా."

అమ్మమ్మ వెళ్ళగానే తనుతిన్న కంచం తొలిచి అందులో కొంచెం అన్నంపెట్టి, కుండలో పాలు జాగ్రత్తగా వొంచి అతను తనగదిలోకి వొచ్చాడు. కుక్కపిల్ల అక్కడలేదు. కట్టుతాడు కొరికేసినట్టుతెగిపోయిఉంది.

కంచం కిందపెట్టి అతను అన్నిచోట్ల వెదకడం ప్రారంభించాడు. ఎక్కడా కనపడలేదు. అమ్మమ్మకి నిద్రపట్టిందేమోనని చూడ్డానికి గదిలోకి తొంగిచూశాడు. కళ్ళుమూసుకుని పడుకున్న అమ్మమ్మవేపు ముఖం ఓరగా పెట్టి అనుమానంగా తోక ఆడిస్తూ కూర్చుంది కుక్కపిల్ల. అతన్ని చూడ్డంతోటే ఎరుగుదునని చెప్పడానికి ఒక వింతధ్వని చేసింది. అమ్మమ్మ మేలుకుంది.

"ఎవరది?....ఛీ ! ఛీ ! వెధవకుక్కపిల్ల. ఎక్కడనించి వొచ్చింది!"

అతను ఏం చెయ్యడానికీ తోచక కుక్కపిల్లని ఎత్తుకున్నాడు.

"నువ్వే తెచ్చావూ? వెధవకుక్కని. నీకింట్లో అన్నంపెట్టను. నువ్వూ అదీ పోండి. ఇల్లంతా అంట్లమంగలం."

"పాపం, దారితప్పినట్టుందమ్మా. పెద్దకుక్కలు కరిచి చంపేస్తాయని లోపలికి తీసుకొచ్చాను."

"చస్తేచస్తుంది. దాన్ని అవతల వొదిలేసి రా."

అమ్మమ్మ మళ్ళీపడుకుంది. శ్రీనివాసరావు కుక్కపిల్లని తనగదిలోకి తీసుకొచ్చి పాలు అన్నం తినిపించాడు. పళ్ళెం తనే కడిగి జాగర్తగా వంటింటిలో పెట్టాడు. ఒకమారుమూలగదిలో జాగ్రత్తగాకట్టేసివచ్చి పడుకున్నాడు.

అతనికి నిద్రలో ఎన్నో కలలువచ్చాయి. ఆడపిల్లలు, పెళ్ళిళ్ళు, అమ్మమ్మ, పెద్దకుక్కలు, సినిమా, అన్నీ తెరమీదిబొమ్మల్లాగా నడచిపోతుంటే అతనికి చటుక్కున మెలకువ వచ్చింది. కలలో ఆఖరిభాగం తాలూకు ధ్వనులు అతనికి స్పష్టంగా వినపడడం మొదలుపెట్టాయి. గడియారంలో మూడయింది. అమ్మమ్మ గొంతుక కోపంగా వినబడుతోంది. లేచి వంటింట్లోకి వెళ్ళాడు. వంటిల్లంతా చాలా గందరగోళంగా ఉంది. పాలకుండ పగిలిపోయింది. పొయ్యిమీద పెట్టిన అన్నమూ కూర కిందపడి ఉన్నాయి. ఇంతలో కుక్కపిల్లవచ్చి అతని రెండుకాళ్ళ మధ్యా నక్కివుంది.

"ఇల్లంతా అంట్లమంగలం. నే నవతల పారెయ్యమంటే ఎందుకు పెట్టావు దాన్నింట్లో? బుద్ధిలేదూ? వెధవకుక్క. అన్నీ తగలేసింది."

కుక్క నాలుకపైకిపెట్టి అమ్మమ్మవేపు నిదానంగాచూస్తూవగరుస్తోంది

"పైకి రా, చావగొడతాను."

మాటలు అర్థంకాకపోయినా అమ్మమ్మ కోపం దానికి అర్థమయింది. అదికాస్త తోకముడుచుచుని కాళ్ళమధ్య ఇరుక్కుంది.

"ఎవరికుక్కో తెలుసుకుని పంపించేస్తానమ్మమ్మా. పాపం వీధిలో వొదిలిపెడితే కుక్కలన్నీ పీకేస్తాయి...ఏమే వెధవకానా. అమ్మమ్మని విసిగిస్తున్నావా?" అంటూ అతను దాన్ని ఎత్తుకున్నాడు. కుక్క గారంగా ఆవులించి సన్నగా మొరిగింది. అమ్మమ్మ కోప్పడ్డకొద్దీ అతనికి దానిమీద

దయ ఎక్కువయింది. దాన్ని చంకని ఎత్తుకుని అతనా సాయంకాలం సినీ మాకి డబ్బు ఎల్లావొస్తుందని ఆలోచిస్తున్నాడు.

"అమ్మమ్మా! నాకు....కొంచెం....డబ్బు... ఏమన్నా...."

"డబ్బు!.... ....ఎక్కడుంది? ముప్పయి రూపాయిలూ ఏంచేశావు? దమ్మిడీ ఇవ్వను."

ఆ పరిస్థితుల్లో ఇంక అమ్మమ్మ ఎంత బతిమాలినా డబ్బు యివ్వదని అతనికి తెలుసు. ముఖం కడుక్కుని దుస్తులు వేసుకుని అతను బయలు దేరాడు. కుక్కపిల్లని ఎక్కడో ఒదిలెయ్యాలి. తన జీవితం ఆనాటితో ఆఖరయిపోయినట్టు అనిపించింది అతనికి. సాయంకాలం ఆ అమ్మాయిని సినీమాకి తీసుకువెళ్ళకపోతే. యింక ఆ అమ్మాయి ముఖం అతను చూడ లేడు. తిన్నగా పార్కులోకి నడిచి వెళ్ళాడు. అక్కడ కూర్చున్నాడు. కుక్కపిల్ల అతని బాధ తనకి అర్థమయినట్టుగా అతనివేపు ముఖం ఓరగా పెట్టి చూపింది. అతను జాలిగా దానివేపు చూశాడు.

"నిన్నెక్కడ వొదిలిపెట్టమంటావు? ఈ దుర్మార్గపు లోకంలో శత్రు వుల మధ్య నిన్ను వొదిలిపెట్టి ఎట్లాపోను? నిన్ను ఇంటికి తీసుకువెడితే అమ్మమ్మ ఈసారి నన్ను ఇంట్లోకిరానివ్వదు. ఏం చెయ్యను మరి?"

కుక్క వొళ్ళు విదుపుకుంది. చెవులు దులుపుకుంది. భావిని గురించిన చింత దానికాట్టే ఉన్నట్టు కనిపించలేదు.

"నీవనేబాగుంది. నువ్వు స్నేహితురాళ్ళని సినీమాలకు తీసుకెళ్ళ నక్కరలేదు. డబ్బు కర్చుపెట్టి బీచ్‌కీ అక్కడికీ షికార్లు నీకు అక్కరలేదు. ఏమంటావు? అవునా?"

తను వెళ్ళిపోయేటప్పుడు తనతోకూడా పడుతుందేమోనని తను కూర్చున్న బెంచికాలికి దాన్ని తాడుతో కట్టేస్తూ అన్నాడు.

"నేను చాలా ఘోరమయిన పని చేస్తున్నానని నాకు తెలుసు. ఏం చెయ్యను. నీకు అదృష్టం ఉంటే ఎవర్రో మంచి వాళ్ళు దయతలచి తీసుకు వెడతారు. లేదంటావా....నీ..."

తక్కిన మాటలు అనలేకపోయాడు. చిన్ననాడు తను విన్న కథలు జ్ఞాపకం వచ్చాయి. రాణి తన సవతి కుర్రాణ్ణి నరికి అరణ్యంలో పారవేస్తి రమ్మని నౌకర్ల చేతికిచ్చి పంపితే వాళ్ళు నరకడానికి చేతులురాక అడివిలో ఆ కుర్రాణ్ణి వొదిలేసి వొస్తారు. తను అల్లాంటి పని ఏదో చేస్తున్నంత బాధ కలిగింది. ఇంక వెళ్ళిపోదామని లేచి నిలబడి మనస్సు దిట్టం చేసుకుంటున్నాడు.

"అక్కయ్యోయి! మన కుక్కపిల్ల ఇదుగోనేవు" అని ఒక కుర్ర గొంతుక అరిచింది.

"ఏదీ" అని ఒక ఆడగొంతుక ఆదుర్దాగా అడిగింది.

శ్రీనివాసరావు తన సంతృప్తిని చూపుల్లో కనబరుస్తూ ఆమెవేపు చూశాడు. అతని మనస్సులో దిగులు పొగమంచులాగ విడిపోయింది. ఆ వొచ్చిన అమ్మాయి కుక్క పిల్లని విప్పి కౌగిలించుకొని గారం చేస్తూ అంది,

"ఏమయిపోయవే ముండా, పొద్దుటినించీని! నీ కోసం వెతుక్కు చచ్చాం."

శ్రీనివాసరావుకి అమాంతంగా ఆ కుక్కపిల్ల యెడల అసూయ పుట్టుక్కొచ్చింది. కుక్కపిల్ల తన సంతోషాన్నంతని ముక్కురంధ్రాల కదలికలోనూ, తోక ఆడింపులోనూ తెలియపరుస్తుంది. ఇంతలో ఒక పెద్దమనిషి దగ్గరగా వచ్చాడు.

"నాన్నా! మన కుక్కపిల్ల దొరికింది."

"దొరికిందా?....... ఓసి ముండా!........ వీరెవరు?"

ఆ అమ్మాయి మొదటిసారి అతనివేపు చూసింది. అందరివేపూ ఒకలాగే నవ్వుతూ అమాయకంగా చూసే ఆ చూపులు శ్రీనివాసరావుకి గుండెల్లో గుచ్చుకున్నాయి.

"నా పేరు శ్రీనివాసరావు.... ఈ కుక్కపిల్ల ఈవేళ పొద్దున్న మౌంటురోడ్డులో నాకు దొరికింది. ఇంటికి తీసుకుపోయి కాస్త పాలుపోశాను. సాయంకాలం ఊరికే షికారుగా తీసుకొచ్చాను. ఇంతటిలోకే దైవవశాత్తూ...."

"నేను మీ ఋణం తీర్చుకోలేను. మా అమ్మాయి పొద్దున్న అన్నం తినలేదు. ఇది పోయిందని.... .... చాలా సంతోషం."

చిన్నపిల్లవాడు కుక్కపిల్లని, ఇక్కడికీ అక్కడికీ పరిగెత్తిస్తున్నాడు. ఆ బల్లమీదే మిగతా ముగ్గురూ కూర్చున్నారు. శ్రీనివాసరావు సన్న సన్నగా ఆ అమ్మాయివేపు చూస్తున్నాడు. పెద్ద మనిషి పాత స్నేహితుడిలాగ చనువుగా మాట్లాడుతున్నాడు. శ్రీనివాసరావు తన అడ్రసు వారి కిచ్చాడు. వారి అడ్రసు తను తీసుకున్నాడు. పెద్దమనిషి అతన్ని మరునాడు తమ ఇంటికి రమ్మన్నాడు. ఆ ఆహ్వానంలో ఆ అమ్మాయికూడా ఏకీభవిస్తుందే మోనని శ్రీనివాసరావు ఆమెవేపు చూశాడు. కాని ఆ అమ్మాయి కుక్కపిల్ల వేపు ఆనందంగా చూస్తోంది.

"శలవండి, నేను ఇద్దరు ముగ్గురు స్నేహితులతో సినీమాకి వొస్తా నన్నాను. వేళయింది. ఎల్లాగో మీ కుక్కపిల్లను మీకు చేర్చగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది." శ్రీనివాసరావు లేస్తూ అన్నాడు.

"నిజంగా మీ మేలు మర్చిపోలేం" అన్నాడు పెద్దమనిషి.

శ్రీనివాసరావు శలవు తీసుకునే చిరునవ్వుతో, పంట్లాంజేబుల్లో చెయ్యి పెట్టి వెళ్ళబోతూ టక్కున ఆగి ముఖం అదుర్దాగా పెట్టాడు. వెంటనే ఇటూ అటూ చూశాడు. కింద వెతుకుతున్నట్టు చూశాడు.

"ఏమండీ? ఏమన్నా పోయిందా?" అన్నాడు

"ఏమో. పర్సు వేసుకొచ్చినట్టుగానే జ్ఞాపకం. ఇక్కడే.... కూర్చున్నాను.... ఇంటి దగ్గర మరిచిపోయానేమో."

"అయ్యో : ఏమాత్రం?"

"ఎంతో ఉండదు. సినిమాకని పది రూపాయలు గావును వేసుకున్నాను.... మరి.... పోనీలెండి. ఈవేళకి సినిమా ప్రాప్తి లేదు."

"మరి మీ స్నేహితులంతా వొస్తారన్నారు?"

"అవుననుకోండి. సరే ఏం చేస్తాం? పొరపాటయి పోయింది."

" మీకభ్యంతరం లేకపోతే నేనిస్తాను తీసికెళ్ళండి."

"ఎంతమాట—వాళ్ళదగ్గర డబ్బుంటుంది గాని.—అయినా వాళ్ళని అడగడమంటే ఏమిటో...."

"మరేం ఫరవాలేదు. మీరు తరువాత ఇవ్వొచ్చు. ఈ పదిరూపాయలు తీసికెళ్ళండి."

"నాకు చాలా తలవంపుగా ఉంది. బొత్తిగా నన్ను ఎరగరు మీరు మీ దగ్గర పుచ్చుకోడమంటే ..."

"రేపెల్లాగావొస్తారుగా మా యింటికి. మనం. పాత స్నేహితులలాగే మసులుకోవాలి ఇంక."

"మీ మేలు మరిచిపోలేను. నాకు వేళవుతోంది.... శలవిప్పిస్తారా?"

"శలవు"

శ్రీనివాసరావుకు అప్పుడు ఎదురుగుండా చెట్టు ఎందుకో విరగబడి నవ్వుతున్నట్టుంది. లోకంలో దేవుడు వుండితీరాలని. అవసరంలో ఆదుకుని తీరతాడని [illegible] మంతా ఇంత సంతోషంగా ఉండడమే తార్కాణమని శ్రీ[illegible] యా అనుకున్న చోటికి బయలుదేరాడు. •

పాలగుమ్మి పద్మరాజు సమగ్ర సాహితి